ఆర్బీకేలు.. రైతన్న నేస్తాలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతు రాజయ్యాడు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలను అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చింది. దీంతో అన్నదాతలు ఆనందంగా జీవనం సాగిస్తున్నారు.

కావలి/బిట్రగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయంలో నూతన శకానికి నాంది పలికాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఎక్కడా లేని విధంగా అన్నదాతలకు గ్రామస్థాయిలో అన్ని అందుబాటులో ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2020 మేలో ప్రారంభించిన రైతుభరోసా కేంద్రాలను దశల వారీగా బలోపేతం చేశారు. భూసార పరీక్షల నుంచి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించడంతో పాటు ఆర్బీకేలనే కొనుగోలు కేంద్రాలుగా మార్చారు. దీంతో రైతులకు అవసరమైన అన్ని సేవలు ఒకే చోట అందుబాటులోకి వచ్చాయి. దీంతో గతంలో మాదిరి విత్తనాలు, ఎరువుల కోసం, పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతులు అగచాట్లు పడే పరిస్థితి లేకుండా పోయింది. వీటితో పాటు రైతులకు ఉచితంగా పంట బీమా కల్పించడం, ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే పరిహారం అందించడంలోనూ ఆర్బీకేలు కీలకంగా మారాయి.

కావలి నియోజకవర్గంలోని కావలితో పాటు అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో వరితో పాటు తీరప్రాంత గ్రామాల్లో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగు కూడా అధికంగా ఉంది. గతంలో రైతులకు విత్తనాలు అవసరమైనా, ఎరువుల కావాలన్నా రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. డిమాండ్ అధికంగా ఉండే సందర్భాల్లో బ్లాక్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో రైతులు అల్లాడిపోయేవారు. ధాన్యం చేతికి వచ్చిన తరువాత కూడా ఏర్పాటు చేసిన ఒకటి, రెండు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం



అల్లూరులోని రైతుభరోసా కేంద్రం

బస్తాలు లేకపోవడం, సిబ్బంది కొరత, మిల్లర్లతో ప్రభుత్వ సమన్వయం లేకపోవడం తదితర కారణాలతో పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కూడా పొందలేకపోయేవారు. రోడ్ల పక్కన ధాన్యం ఆరబెట్టుకుని విధిలేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మారుమూల గ్రామాల్లో కూడా ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో రైతులు సొంత గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందడం, పండించిన పంట ఉత్పత్తులను దర్జాగా మద్దతు ధరకు అమ్ముకోవడం సాధ్యమైంది. దీంతో గతంతో పోలిస్తే సాగు విస్తీర్ణం కూడా 20 శాతానికి పైగా పెరిగింది.

సేవలు ఇలా..

- ఆర్బీకేల ద్వారా ఏటా రబీ సీజన్‌లో 5వేలు, ఖరీఫ్ సీజన్‌లో 2వేల క్వింటాళ్లకుపైగా నాణ్యమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. ఈ రబీ సీజన్‌లో అకాల వర్షాలతో


ఎరువులు తీసుకెళ్తున్న రైతులు(ఫైల్)

నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై మరో వేయి క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసింది.
- ఏటా సుమారు 2 వేల టన్నులకుపైగా ఎరువులను రైతులకు అందిస్తోంది.
- పంట నూర్పిళ్ల సమయంలో ఏటా 1.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు కనీస మద్దతు ధర అందిస్తున్నారు.
- ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా ఆర్బీకే సిబ్బంది ముందుగానే ఈ-క్రాప్ ద్వారా వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఏటా సుమారు 15 వేల మంది రైతుల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా వారికి మెరుగైన సేవలు అందిస్తున్నారు.
- ఆర్బీకేల ద్వారా రైతు భరోసా, పీఎం కిసాన్, పొలంబడి, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పంట బీమా, తదితర సుమారు 20 రకాల సేవలు అందిస్తున్నారు.
- భూసార పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతిలో నేల స్వభావాన్ని, సూక్ష్మ, స్థూల పోషకాలను అంచనా వేసి రైతులకు ఎంత మేర ఎరువులు వేయాలి, ఏఏ పంటలు పండించుకోవాలి వంటి విలువైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. తద్వారా రైతులు పెట్టుబడి గణనీయంగా ఆదా అయింది. గతంలో భూసార పరీక్షలు చేయాలంటే రైతులకు అసాధ్యంగా ఉండేది. ప్రస్తుతం ఆర్బీకేల సిబ్బంది నేరుగా పొలానికే వచ్చి భూసార పరీక్షలు నిర్వహిస్తుండటం విశేషం.
- ఆర్బీకేల ద్వారా పంటల బీమా కూడా రైతులకు సులభంగా అందుబాటులోకి వచ్చింది. ఆర్బీకేల్లో ఉన్న రైతుల వివరాల ఆధారంగా సిబ్బంది పంటల బీమా చేయించడంతో పాటు ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోతే వెంటనే పరిహారం అందించే అవకాశం లభించింది.
- రైతు భరోసా పథకంతో పాటు ఆర్బీకేల ద్వారా అందించిన సేవలతో గడిచిన నాలుగేళ్లల్లో నియోజకవర్గంలోని 35 వేల మంది రైతులకు రూ. 225 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

63 ఆర్బీకేల ద్వారా సేవలు

కావలి నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 63 ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో 30 ఆర్బీకేలకు సొంత భవనాలు ఉండగా, 33 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో ఆర్బీకే నిర్మాణానికి రూ.23.94 లక్షల వంతున ఖర్చు చేసింది. ఈ ఆర్బీకేల్లో ప్రస్తుతం 44 మంది సిబ్బంది రైతులకు సేవలు అందిస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నారు



రైతుభరోసా కేంద్రంలో నాణ్యమైన వరి వంగడాలు అందజేస్తున్నారు. దీంతో మంచి దిగుబడులు పొందుతున్నాం. ఎరువులు ఇంటి వద్దే అందిస్తున్నారు. యూరియాను బ్లాక్‌లో కొనే దారుణమైన పరిస్థితి లేకుండా, ఎమ్మార్పీకే అందజేస్తున్నారు.

–షేక్ రసూల్, రైతు, అల్లూరు

అగచాట్లు తప్పాయి



గతంలో విత్తనాలు, ఎరువుల కోసం అగచాట్లు పడాల్సి వచ్చేది. పనులు మానుకుని దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆర్బీకేలో దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దే నాణ్యమైనవి అందజేస్తున్నారు. వ్యవసాయానికి సంబంధించిన ఎలాంటి సమాచారం కావాలన్నా ఆర్‌బీకే ఉద్యోగులు చెబుతున్నారు.

– రఫీ, రైతు , అల్లూరు

క్లుప్తంగా

వైభవంగా సరస్వతి పూజ



అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ ఆధ్వర్యంలో గురువారం సరస్వతి పూజను వైభవంగా నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు తమకు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులను ప్రసాదించాలని సరస్వతీదేవిని వేడుకున్నారు. ఆత్మకూరు బీఎస్సార్ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ షకీలతో పాటు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దివ్య సహకారంతో రెడ్‌క్రాస్ చైర్మన్ ఎండీ సాధిక్‌హుస్సేన్, ఎన్‌జీఓ శ్రీహరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. దాతలకు ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



సంగం: మండలంలోని దువ్వూరులో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజను గురువారం నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు నిర్వహించి భూమి పూజ జరిపారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీలు బాధ్యతగా విధులు నిర్వహించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ లావణ్య

ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పచ్చవ లావణ్య అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. సమన్వయంతో పనిచేసి ప్రాజెక్ట్‌కు మంచిపేరు తేవాలన్నారు. కేంద్రానికి ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు వచ్చేలా చూడాలన్నారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధన చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ తేజస్విని పాల్గొన్నారు.

పశు విజ్ఞానబడి



సంగం: స్థానిక పశు వైద్యశాలలో డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పశు విజ్ఞానబడి నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ జయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై పశు బీమా, పెయ్య దూడల పెంపకం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సచివాలయ ఏహెచ్‌ఏ గణేష్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ


నాగులపాటి ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

ఆత్మకూరురూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ప్రతాప్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన గండ్లవీడుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రోశయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదిశేషయ్య, నాయకులు కూనం సుధాకర్‌రెడ్డి, కొల్లి దొరస్వామినాయుడు, శ్రీనివాసులునాయుడు, సర్పంచ్‌లు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బాలఅంకయ్య, బత్తిన నారాయణ ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

కావలి: పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో గాంధీ విగ్రహం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీత పనులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. డ్రెయిన్ పూడికతో నిండడంతో తరచూ మురుగు పొంగి ప్రవహిస్తూ వ్యాపారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను మాజీ కౌన్సిలర్ కనమర్లపూడి వెంకటనారాయణ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది గురువారం గ్యాంగ్ వర్క్ చేసి డ్రెయిన్‌లోని పూడిక తొలగించారు. ఈ పనులను


పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యే రామిరెడ్డి పరిశీలించి సూచనలు చేశారు. మురుగు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, చిరువ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఆత్మకూరురూరల్: ఆరవీడు జంగాలపల్లికి చెందిన తలచీరు సుబ్బమ్మ అనే వృద్ధురాలికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.75 వేల చెక్కును ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు చికిత్స చేయించుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారని చెప్పారు. సుబ్బమ్మ కాళ్ల ఆపరేషన్ చేయించుకుని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు, నాయకులు సయ్యద్ జమీర్‌బాషా, ధనాల రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

మర్రిపాడు: ఆత్మ ఆధ్వర్యంలో కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులకు భూసార పరీక్షలపై గురువారం అవగాహన కల్పించారు. ఆత్మ డీపీడీ జీ శివన్నారాయణ మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, వాటి ఫలితాలు, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారులు బీ జ్యోత్స్న, కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్ పీ అనూష, మండల ఏఓ ఎస్ రామ్మోహన్, వీఏఏలు మల్లికార్జున్, జవహర్ నవోదయ ప్రిన్సిపల్ పీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ నాసిన్ బేగం పాల్గొన్నారు.


మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

టీ తాగేందుకొచ్చి గొలుసు అపహరణ

మర్రిపాడు: టీ తాగేందుకు కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు టీ దుకాణంలోని మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లి ఘటన మర్రిపాడు బస్టాండ్‌సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో లక్ష్మీకుమారి టీ దుకాణం నిర్వహిస్తోంది. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో టీ దుకాణం వద్దకు కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు టీ తాగి బయల్దేరే సమయంలో లక్ష్మీకుమారి మెడలోనే నాలుగు సవర్ల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. గురువారం బాధితురాలు మర్రిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వాకాటి నరసయ్య శ్రీత్యాగరాజ కల్యాణ మండపం కమిటీ, శ్రీసీతారామ స్వామి మందిర కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం బాలాజీనగర్‌లోని శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆరాధనోత్సవం ఆహ్వాన పత్రికలను కమిటీ కార్యదర్శి అమరా మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, ఎంపీ ఆంజనేయులు, సహాయ కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, సభ్యులు తన్నీరు మస్తాన్‌రావు, స్వామి పూర్ణచంద్రరావు, సంగీత విద్వాంసురాలు లక్ష్మీకామాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామిని స్మరిస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక సంగీత కళాకారులచే శ్రీత్యాగరాజస్వామి 'పంచరత్న కీర్తనల గానం', 4 గంటలకు వయోలిన్ ద్వయం, తదుపరి సింహపురి వీణాత్రయం శిష్య బృందం నాద నీరాజనం, అనంతరం సంగీత గురువులు, శిష్య బృందంతో శ్రీత్యాగరాజ దివ్యనామ సంకీర్తనాలాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. త్యాగరాజస్వామి భక్తులు, సంగీత కళాకారులు, ప్రజలు విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఉదయగిరి: పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందించారు. గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం శివకల్పన 55 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.గర్భిణులకు పలు రకాల పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు చేశారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించి ఉచితంగా నెలకు సరిపడా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జలదంకి: మండలంలోని అన్నవరం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్‌రావు గురువారం తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. స్పెషలిస్టు కంటి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల అద్దాలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు: మండల నూతన తహసీల్దార్‌గా అరుణాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడ నియమించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏ చంద్రారెడ్డిని అక్కడికి బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. వివరాలు..తరుణవాయికి చెందిన పోలయ్య దంపతులు బైక్‌పై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో స్వల్పంగా గాయపడ్డారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆటోలో వైద్యశాలకు తరలించారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిటీలో దండాకు చోటు



అల్లూరు: వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ దండా కృష్ణారెడ్డికి పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కమిటీలో చోటు దక్కింది. ఆయన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా దండాకు మండల నాయకులు అభినందనలు తెలిపారు.

ఎన్వీకండ్రిగలో అదుపులోకి వచ్చిన జ్వరాలు

చేజర్ల: ఎన్వీకండ్రికలో వైద్యశిబిరం గురువారం కూడా కొనసాగింది. వైద్యాధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. జ్వరాలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. కాగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

క్రైస్తవుల ఆత్మీయత మరువలేనిది


కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలోని క్రైస్తవులు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆత్మీయత మరువలేనిదని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని తన నివాసంలో కావలి నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రిస్టియన్ ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డిని సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్టియన్లను దయార్ద్ర హృదయంతో ఆదరించారని, ఈ విషయాన్ని క్రిస్టియన్ సమాజం మరువదన్నారు. ప్రజాసేవకుడైన రామిరెడ్డికి తమ ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాశీర్వాదంతో తాను రెండుసార్లు ఎమ్మెల్యేను అయ్యానని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనకు అండగా నిలిచి ఆశీర్వదిస్తే మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పాస్టర్లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం


అల్లూరు: ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

అల్లూరు: క్రైస్తవులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక చవటపాళెంలోని ఏసు అభిషేక మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాస్టర్ల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్లకు గౌరవవేతనం అందజేస్తున్నారని తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవులందరూ మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. తొలుత పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవరకొండ శామ్యూల్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ఉదయగిరి: మార్చి 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం శివకల్పన, వినీత కోరారు. ఉదయగిరిలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో పై వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులు 3,451 మందికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం మండలాన్ని ఐదు రూట్లుగా విభజించి 52 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, 206 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. ప్రతి చిన్నారికి పోలియోచుక్కలు వేసి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు చెన్నయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో పల్స్‌పోలియో లక్ష్యాన్ని నూరుశాతం సాధించాలని వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కరీష్మా అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియోపై వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,800 మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం మండలాన్ని నాలుగు రూట్లుగా విభజించి 38 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటుచేసి 148 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరిలో శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

క్రీడాకారుడికి అభినందన

ఆత్మకూరురూరల్: జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో బంగారు పతకం సాధించిన ఆత్మకూరుకు చెందిన సాయికిరణ్‌ను ఆత్మకూరు శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ గురువారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ ఆత్మకూరుకు చెందిన సాయికిరణ్‌కు జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గర్వణీయమన్నారు. ఆస్పత్రి వైద్యులు కుమార్, సందీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు తోడేటి అశోక్, రాఘవ, సాయకిరణ్ తండ్రి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

